సమాచారం

వారాంతపు సంతలు

గచ్చిబౌలి: వారాంతపు సంతల నిర్వహణలో భాగంగా శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో ఆదివారం తారా నగర్, గుల్‌మోహర్‌పార్కుకాలనీ,నానక్‌రాంగూడ, మదీనాగూడ, గోకుల్‌ఫ్లాట్స్ పెద్ద చర్చి వద్ద నిర్వహిస్తారు. ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్వహించే సంతలలో సరసమైన ధరలకు తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, నిత్యావసరాలు, దుస్తులు, ఇతర వస్తువులు లభిస్తాయి.

శిల్పారామంలో 'నాట్యోత్సవ్–2023'

మాదాపూర్‌లో శిల్పారామంలో శ్రీగురు నృత్యాలయం ఆధ్వర్యంలో 'నాట్యోత్సవ్–2023' ప్రత్యేక కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి శ్రీచైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ కవిత ప్రారంభిస్తారు. ఇందులో ముఖ్యఅతిథిగా సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పర్ట్ గాదేపల్లి శ్రీనివాస్, ఇంటర్నేషనల్ యానిమేషన్ జ్యూరీ సభ్యుడు నాగబాల సురేష్‌కుమార్ పాల్గొంటారు. అనంతరం గురు శ్రీలక్ష్మీ నల్లమోలు ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తారు.

క్లుప్తంగా

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్ : ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శనివారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడకు చెందిన మాస్టర్ లహరి, రోహిత్‌లకు అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి కింద ఇద్దరికి కలిపి విడుదలైన రూ.3 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, చంద్రారెడ్డి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి సన్నిధిలో పూజలు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శైలజ, నాయకులు పెంటారెడ్డి, రంగారెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

స్వరార్చన.. నృత్యార్చన



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న అన్నమయ్య స్వరార్చనలో భాగంగా శనివారం నృత్య గణేశ భరతనాట్య సంస్థ గురువు యం.లలిత వినోద్ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. కళాకారులు జ్యోతిక, తృతీత, ధనశ్రీ, సుష్మిత, ఇషిక, సూర్యభద్ర బేహరా, అశ్రిత కోవలి, భానుశ్రీ, లిఖితారెడ్డి, యస్.వర్షిణి, నివాసిణి గుప్తా, దీక్షిత, తమన్వి, విశ్లేష, తులసిభవాని, తనుశ్రీ,, సితారలు పాల్గొన్నారు.అలాగే గరుడ గమన, కొమ్మలాల, నవరసములది, తారకమంత్రము తదితర సంకీర్తనలతో అలరించారు.

డీసీఎంను ఢీకొన్న కారు

- అక్కడికక్కడే ఒకరి మృతి



బాలాజీ పవన్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: ముందు వెళుతున్న డీసీఎంను వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన భానూర్–బీడీఎల్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బీడీఎల్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం...అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేటకు చెందిన బాలాజీపవన్(38) శనివారం తెల్లవారుజామున వెలమెల గ్రామశివారు ఓఆర్‌ఆర్‌పై ముందు వెళుతున్న డీసీఎంను తన కారుతో ఢీకొట్టాడు. ఈ ఘటనలో బాలాజీ పవన్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వరుసకు సోదరుడైన శ్రావణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పటాన్‌చెరు : రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



న్యూ హాఫీజ్‌పేట్ సర్వే నంబర్ 80 ఈద్గాలో..



ప్రేమ్‌నగర్ ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

ఘనంగా రంజాన్

ఈద్గాలు, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు

- పాల్గొన్న చేవెళ్ళ ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని ఈద్గాలు, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.'రంజాన్' వేళ పరస్పర శుభాకాంక్షలు చెప్పుకుంటూ చిన్నాపెద్దా తేడా లేకుండా ఆనందంగా గడిపారు. ఆదిత్యనగర్, ప్రేమ్‌నగర్, సర్వేనెంబర్ 80, గోపీనగర్, గుట్టల బేగంపేట్ ఈద్గాలు, కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హాఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్లలోని కాలనీలు, బస్తీలలోని మసీదులు కిటకిటలాడాయి. ఈద్గాలు, మసీదుల వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు. సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర ఆదేశం మేరకు మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, ఏసీపీ నర్సింహారావు, గచ్చిబౌలి, రాయదుర్గం, మాదాపూర్, మియాపూర్, చందానగర్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

– గచ్చిబౌలి/ హాఫీజ్‌పేట్/శేరిలింగంపల్లి



ఆదిత్యనగర్‌లో పండగ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ తదితరులు



గోపీనగర్ ఈద్గాలో..



ఆదిత్యనగర్ ఈద్గాలో..

అన్నదానం

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని మంజీర క్యాంపస్ రామలింగేశ్వర ఆలయంలో బసవ జయంతిని పురస్కరించుకొని చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మహేశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6:30 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు

కూకట్‌పల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని సురేష్ అన్నారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా వికాస తరంగిణి ఆధ్వర్యంలో సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులు శనివారం 'మొక్కలను రక్షించు.. వేసవి వేడిని తగ్గించు' నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సురేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజు నాడు మొక్కనాటి కాపాడాలన్నారు. తరంగిణి పీఆర్‌ఓ యోగేష్ ప్రభు మాట్లాడుతూ అందరు స్వదేశీ వస్తువులు వాడాలని దేశ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాధవరం కాంతారావు, డాక్టర్ శ్రీనాథ్, వికాస్ తరంగిని అధ్యక్షుడు శ్రవణ్, హరిబాబు, నాగేశ్వర్‌రావు, కృష్ణంరాజు, విఠల్, వైకుంఠం, కళావతి, శశికుమార్, కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే సమస్యల పరిష్కారం

నానక్‌రాంగూడలో పబ్లిక్ కాంటాక్ట్



నానక్‌రాంగూడలో సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రజలు, ప్రభుత్వ అధికారుల మధ్య సమన్వయంతోనే సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని నానక్‌రాం గూడలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ పబ్లిక్ గ్రీవెన్స్ డిస్పోజల్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, అధికారులతో ముఖాముఖి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను అధికారులు ఎప్పటికప్పుడు నోట్ చేసుకుంటూ వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ సురేష్, జలమండలి మేనేజర్ నరేందర్‌రెడ్డి, ఎల్‌ఓ కృష్ణ, వర్క్ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, సిబ్బంది కిష్టయ్య, శ్రీనివాస్, సుమన్, మహేందర్ నాయకులు కైలాష్‌సింగ్, ముత్యంరెడ్డి, శివసింగ్, యాదగిరి, మల్లేష్, అరుణ్‌గౌడ్, గోపాల్, కవిత, మహేందర్, సత్యనారాయణసింగ్ ,శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వసతుల కల్పనకు కృషి



ఎస్‌జేబీ హిల్స్‌లో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వీరేందర్‌రెడ్డి

నిజాంపేట్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎస్‌జేబీ హిల్స్ కాలనీలో నూతనంగా సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఆయనను శాలువతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వీరేందర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థలను ఆధునికీకరిస్తున్నామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కృష్ణారావు, కేవీరావు, సుబ్బరా, చందురెడ్డి, శ్రీధర్ రెడ్డి, శివరామకృష్ణ, రాజశేఖర్, ప్రవీణ్, నాగరాజు, వెంకట్, రాంబాబు, సుదీర్, సురేష్, హర్షరవి కాంత్, సుధాకర్, శ్రీనివాస్, రామలక్ష్మి, త్రిపుర, లత తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



స్వామి సన్నిధిలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు

రాయదుర్గం: 'సాయిరామ్' నామస్మరణతో షిర్డీసాయిబాబా ఆలయం మారుమ్రోగింది. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని సాయి ఐశ్వర్యకాలనీలో శనివారం సాయిబాబా ఆలయంలో 7వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకారం చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కాగా ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆయన ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానికులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహ్మామూర్తి, సభ్యులు రాంరెడ్డి, అశోక్‌రాజు, రమణి, సీనియర్ నాయకులు అరుణ్‌గౌడ్, సాయిఐశ్వర్య కాలనీవాసులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం సూత్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్, పద్మావతి ఆర్ట్ అకాడమీ గురువు క్రాంతి కిరణ్ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. ఇందులో వినాయకకౌతం, మూషికవాహన, దశావతారాలు, హిమగిరి తనయే, పుష్పాంజలి, బృందావన నిలయే, జతిస్వరం, తిల్లాన తదితర అంశాలను కళాకారులు శ్రీ సమన్వి బొల్లికొండ, అమూల్య, పర్ణిక, నైనా, ఐశ్వర్య, విశాఖ, చిన్మయి, పూజిత, అస్మిత, లాస్య, ప్రియా, శ్రీజ, దుర్గ, జాహ్నవి,వెన్నెల ప్రదర్శించారు.

నేడు 'జయభేరి' ఆవిష్కరణ

గచ్చిబౌలి: ప్రముఖ జర్నలిస్ట్, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి రచించిన ' శ్రీశ్రీ జయభేరి 'పుస్తకావిష్కరణ ఆదివారం ఉదయం 10.30 గంటలకు గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని ప్రధాన గ్రంథాలయం ఆధ్వర్యంలో జరుగుతుందని విజ్ఞాన కేంద్రం ఓ ప్రకటనలో తెలిపింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ, గాయకుడు గోరటి వెంకన్న, తెలంగాణ సాహితీ ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి, సీనియర్ కవి విమర్శకులు నిఖిలేశ్వర్, సినీ రచయిత సాయి మాధవ్ తదితరులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

ప్రజా సమస్యలు తీర్చేవారు లేరు

ఆల్విన్‌కాలనీ: అధికారులు, నాయకుల మధ్య సమన్వయం లేనందునే సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో గడపగడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజా ప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో ప్రజలు కష్టాలు పడుతున్నారన్నారు. ఎన్నిసార్లు జీహెచ్‌ఎంసీ కార్యాలయం చుట్టూ తిరిగినా, ఎమ్మెల్యేను కలిసినా ఒక్క పని జరగటం లేదని ప్రజలు వాపోతున్నారన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రజల సమస్యలు తీర్చేవారు లేరన్నారు. ప్రజల కష్టాలు పరిష్కరించేందుకు బీజేపీ ఎల్లప్పుడూ ముందు ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రావు, నర్సింగ్‌రావు, నరేందర్‌రెడ్డి, కల్పనా ఏకాంత్ గౌడ్, గోపాల్‌రావు, శ్రీహరియాదవ్, కుమార్ యాదవ్, నర్సింగ్ యాదవ్, నరసింహాచారి, నామాల శ్రీనివాస్, లలిత రెడ్డి, మమత, రేణుక, జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో అన్నివర్గాల వారికి సముచిత స్థానం

బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్



బీజేపీలో చేరిన వారితో నాయకులు రవికుమార్‌యాదవ్ తదితరులు

గచ్చిబౌలి: బీజేపీలో అన్నివర్గాల వారికి సముచిత స్థానం ఉంటుందని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ అన్నారు. బీఆర్‌ఎస్‌పార్టీ హయాంలో 9 ఏళ్లలో గచ్చిబౌలి గ్రామానికి చేసింది ఏమీ లేదని విమర్శించారు. శేరిలింగంపల్లి డివిజన్ గచ్చిబౌలి గ్రామం నుంచి భారీ సంఖ్యలో యువకులు, స్థానికులు శనివారం బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గచ్చిబౌలి గ్రామంలో జరిగిన అభివృద్ధిఅంతా మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ హయాంలోనేనని అన్నారు. ఇన్నేళ్ళుగా ఎమ్మెల్యే గాంధీ గచ్చిబౌలి గ్రామాన్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కార్యక్రమంలో రాధాకృష్ణయాదవ్, ఎల్లేష్, అనీల్‌కుమార్‌యాదవ్, రమేష్, నర్సింహ్మా, శశాంక్, మఖన్‌సింగ్, పార్టీలో చేరినవారిలో గణేష్, రవి, మల్లేష్, ప్రకాశ్, కోటేష్, మల్లేష్, పరుశురామ్, ముఖేష్, పలువురు యువకులు ఉన్నారు.

జిల్లా అథ్లెట్లకు ప్రత్యేక శిక్షణ

మియాపూర్ : రంగారెడ్డి జిల్లా మాస్టర్ అథ్లెట్లు మరింతగా రాణించేందుకు తగిన ప్రోత్సాహం అందిస్తామని రంగారెడ్డి జిల్లా మాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు కొండా విజయ్‌కుమార్ పేర్కొన్నారు. హర్యానా రాష్ట్రం కురుక్షేత్రలో ఫిబ్రవరి 16 నుండి 19 వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ మాస్టర్ అథ్లెట్లో ప్రతిభ కనబరిచిన వారిని చందానగర్ హుడా కాలనీలో ఓ కార్యక్రమంలో సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా అథ్లెట్లకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మాస్టర్స్ అసోసియేషన్ సెక్రటరీ సురేందర్, అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్ రెడ్డి, సభ్యులు ఏసురత్నం, బాల్‌రాజ్, శివలీల పాల్గొన్నారు.

పాజిటివ్ నిల్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఆరుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకులు మనోహర్ తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో ముదురుతున్న వివాదం

- నిధులు కేటాయించడంలేదని కౌన్సిలర్ల ఆరోపణ
- రాజీనామా యోచనలో కౌన్సిలర్లు
- బొల్లారం మున్సిపాలిటీలో కుంటుపడుతున్న అభివృద్ధి



బొల్లారం మున్సిపాలిటీ కార్యాలయం

జిన్నారం(పటాన్‌చెరు): అధికార పార్టీకి చెందిన కొంతమంది కౌన్సిలర్లు తీవ్ర నిరాశతో ఉన్నారు. సొంత పార్టీలో ఉన్నా తమకు నిధులు కేటాయించటంలేదని కౌన్సిలర్లు వాపోతున్నారు. దీంతో బీఆర్‌ఎస్‌లో ఉన్న రెండు వర్గాల మధ్య వివాదం ముదురుతోంది. మరి కొంతమంది కౌన్సిలర్లు రాజీనామాలు చేసేందుకు సైతం సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. బొల్లారం మున్సిపాలిటీలో 22 వార్డులు ఉన్నాయి. వీటిలో అధికార బీఆర్‌ఎస్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీలకు చెందిన కౌన్సిలర్లు ఉన్నారు. బీఆర్‌ఎస్‌లో మాత్రం రెండు వర్గాలు ఉన్నాయి. వీరిలో చైర్మన్‌కు అనుకూలంగా ఉన్న కౌన్సిలర్లకు మాత్రమే నిధులు ఎక్కువగా కేటాయిస్తున్నారని మరో వర్గానికి చెందిన కొంతమంది కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు.

కుంటుపడుతున్న అభివృద్ధి..

గతంలో ఈ విషయంపై కౌన్సిల్ సమావేశాల్లో కౌన్సిలర్లు, అధికారుల మధ్య తీవ్ర వాగ్వాదాలు జరిగాయి. ఇతర పార్టీలకు చెందిన కౌన్సిలర్లతో పోలిస్తే తమ వార్డుల అభివృద్ధికి నిధుల కేటాయింపు తక్కువగా ఉందని ఓ వర్గానికి చెందిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. అధికారంలో ఉండి కాలనీల అభివృద్ధికి నిధులు కేటాయించకపోవటంపై అభివృద్ధి కుంటుపడుతోందని పలువురు కౌన్సిలర్లు వాపోతున్నారు. అధికార పార్టీలో ఉన్న కొంతమందికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వటాన్ని కౌన్సిలర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నెల 24న మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో నిధుల కేటాయింపు విషయంలో నిరసన తెలపనున్నట్లు కొంతమంది కౌన్సిలర్లు తెలిపారు. ఇతర వార్డులకు కేటాయించినట్టుగానే నిధులు కేటాయించాలని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్నారు.